సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 27 । జూలై । 2025



గ్రామాభివృద్ధి కమిటీలు..

వీడీసీలు ఆదర్శంగా ఉండాలే తప్ప.. చట్టాన్ని అతిక్రమించకూడదని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి సూచించారు.

- 8లో ▸



విద్యార్థులకు నాణ్యమైన..

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.6 /22.8

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 1,625 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం 1,625 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాలతో పాటు ఘనపురం ఆనకట్ట, క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,390.66 అడుగుల (4.321 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

జిల్లా ప్రత్యేకాధికారిని కలిసిన మున్సిపల్ కమిషనర్



నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి నియమితులైన రాజీవ్ గాంధీ హనుమంతును మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ కలిశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు ప్రత్యేకాధికారిగా రాజీవ్ గాంధీ హనుమంతు రావడంపై దిలీప్‌కుమార్ సంతోషం వ్యక్తంచేశారు.

మళ్లీ కనిపించిన చిరుత



నవీపేట: మండలంలోని నందిగామ శివారులోని గుట్టపై శనివారం చిరుత పులి మళ్లీ కనిపించింది. 15 రోజుల కిందట నందిగామ శివారులోని పంట పొలాల్లో కనిపించిన చిరుత దృశ్యాలను స్థానిక యువకులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. శుక్రవారం సిరన్‌పల్లి శివారులో మరో చిరుత కనిపించడంతో స్పందించిన ఫారెస్ట్ అధికారులు నందిగామ, సిరన్‌పల్లి గ్రామాలను సందర్శించి చిరుత సంచారం నిజమేనని నిర్ధారించారు. తాజాగా పశువుల కాపరికి నందిగామ శివారులోని గుట్టల అంచుపై చిరుత కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు.

ముఖ గుర్తింపుతోనే చేయూత పింఛన్లు

- డీఆర్డీవో సాయాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): టీజీ ఆన్‌లైన్ అభివృద్ధి చేసిన ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ ద్వారానే ఇక నుంచి చేయూత పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా చనిపోయిన వారికి, ఇతర ప్రదేశాలకు వెళ్లిన వారికి పింఛన్లు ఇచ్చే అవకాశం ఉండదన్నారు. కేవలం కాళ్లు, చేతులు లేని వారికి మాత్రమే పంచాయతీ కార్యదర్శి ద్వారా పింఛన్లు అందజేస్తామని తెలిపారు. నూతన విధానంతో అనర్హులకు పింఛను డబ్బులు అందకుండా అరికట్టవచ్చన్నారు. ఇందుకోసం కొత్త మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలు పోస్టల్ అధికారులకు త్వరలోనే ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో డిచ్‌పల్లి ఎంపీడీవో రాజ్‌వీర్, డీపీవో శ్రీనివాస్‌రావు, ఏపీడీ మధుసూదన్ పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి చెరువు



ఎడతెరిపిలేని వాన

- 24 గంటల వ్యవధిలో 3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు
- శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు..
- వాగుల్లో వరదప్రవాహం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



సాలూర వద్ద మంజీరలో ప్రవహిస్తున్న వరద



వేల్పూర్ - అమీనాపూర్ మధ్య కూలిన చెట్టు

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం రోజంతా జల్లులు కురిశాయి. వాగులు ప్రవ హిస్తున్నాయి. నది పరీవాహక ప్రాంతాలు, వాగుల వద్ద జాగ్రత్తగా ఉండాలని జిల్లా అధికా రులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శుక్రవారం సా యంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోధన్ ప్రాంతంలో అధికంగా వర్షం కురుస్తోంది. మంజీర నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. రుద్రూర్ మండలం చిక్కడపల్లి, ఇందల్వాయి మండలం సి ర్నాపల్లి జానకీబాయి చెరువులు అలుగుపారుతున్నాయి. డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ - కోమటిపల్లి మధ్య వాగులో వరద ప్రవాహం పెరగడంతో అధికారులు పరిశీలించారు. గత రెండు రోజులుగా జిల్లాలో వర్షం కురుస్తుండడంతో చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఈ ఏడాది ఏకధాటిగా వర్షం కురవడం ఇదే మొదటిసారి కాగా.. మరింత వర్షపాతం నమోద య్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికా రులు పేర్కొంటున్నారు. గతేడాది ఇదే సమయానికి 40 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం 29 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 16 మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్లపైకి వరదనీరు చేరింది. డ్రెయినేజీలు నిండుగా ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల నేప థ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు శనివా రం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వర్షపాతం అధికంగా నమోదవుతున్న ప్రాంతాల్లో రెవెన్యూ శాఖతో పాటు అగ్నిమాపక శాఖ ప్రత్యేక బృందాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులను అ ప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు పరిశీల చేపట్టాలని ఆదేశించారు. అధిక వర్షం కారణంగా ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలపై సలహాలు సూచనలు చేశారు. బోధన్, నిజామాబాద్ డివిజన్‌లో అధికవర్షపాతం నమోదవుతోంది.

వరదలో చిక్కుకున్న యువకులు

- సిర్నాపల్లి చెరువు దిగువ ప్రాంతంలో ఘటన..
- కాపాడిన పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



ఇందల్వాయి : నిజామాబాద్ నగరానికి చెందిన ముగ్గురు యువకులు సిర్నాపల్లి గ్రామ శివారులోని జానకీబాయి చెరువు అలుగు కింది భాగంలో నీటి ప్రవాహంలో చిక్కుకుపోయిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పంట పొలాల వద్ద సరదాగా గడపడానికి నగరానికి చెందిన నవీన్, చిన్నన్న, నరేశ్ అనే యువకులు వచ్చారు. ఎగువన ప్రాంతంలో వర్షాలు అధికంగా కురవడంతో చెరువు పొంగి అలుగు ఉధ్రుతంగా ప్రవహించడంతో యువకుల చుట్టూ పెద్ద ఎత్తున నీరు చేరింది. దీంతో వారు కేకలు వేయడంతో అక్కడికి సమీపంలో ఉన్న వారు కాపాడేందుకు విఫలయత్నం చేశారు. పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో అక్కడకు చేరుకొని బోట్లు, పెద్ద తాళ్ల సహాయంతో రాత్రి 8 గంటలకు వరకు శ్రమించి వరదలో చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్

అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

నిజామాబాద్‌అర్బన్ : భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా ఎరువుల నిల్వలు తదితర అంశాలపై అధికారులతో హనుమంతు శనివారం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎస్సారెస్పీతోపాటు కాలువలు, చెరువులు, ఇతర జలాశయాల్లో చేపలు వేటాడేందుకు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలతోసహా ఆయా శాఖలు సన్నద్ధమై ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, చెరువుల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద నీరు భారీగా నిలిచే జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ రైల్వే కమాన్, ముబారక్ నగర్ తదితర ప్రాంతాల్లో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


సీజనల్ వ్యాధులు, పంట ఎరువులు..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఔషధ నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ కూడా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, అతిసారం వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, అన్ని ప్రాంతాల రైతులకు ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌లు

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌తోపాటు అగ్నిమాపక శాఖ, పోలీస్, మున్సిపల్ తదితర కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08462-220183కు సమాచారం అందించాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్థానికులను తరలించేలా పునరావాస కేంద్రాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 20 మందితో కూడిన ఎస్డీఆర్‌ఎఫ్ బృందం 24గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎస్డీఆర్‌ఎఫ్ కంట్రోల్ రూం నెంబర్ 87126 99224, ఇన్‌చార్జి 87126 99225, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి 87126 99141 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

నిజామాబాద్ నగరంలో కూలిపోయే స్థితిలో ఉన్న 167 ఇళ్ల యజమానులకు ఖాళీ చేయాలని నోటీసులు అందించామన్నారు. విష జ్వరాలు ప్రబలిన కాల్పోల్ తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.



జలపాతాన్ని తలపిస్తున్న జానకీబాయి చెరువు అలుగు

ఇందల్వాయి: ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో సిర్నాపల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న జానకీబాయి చెరువు పూర్తి స్థాయిలో నిండి శనివారం మధ్యాహ్నం నుంచి అలుగు పొంగి పొర్లుతోంది. జలపాతాన్ని తలపించేలా 40 అడుగుల ఎత్తు నుంచి నీరు పడుతుండటంతో ఈ అలుగు గత ఐదేళ్లుగా పెద్ద సంఖ్యలో సందర్శకులను, ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. వర్షాలు పడుతుండటం చెరువుకి చేరుకోవడానికి ఉన్న దారి కూడా చిత్తడిగా మారడం, అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో సందర్శకులు ఇప్పుడే జానకీబాయి అలుగును చూడటానికి రావద్దని గ్రామస్తులు తెలిపారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- రోగులకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలి
- అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తాం
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



జీజీహెచ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ నాగారం : వైద్యులందరూ అందుబాటులో ఉంటూ రోగులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆస్పత్రిలో అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ఆయన జీజీహెచ్‌ను సందర్శించారు. అంతకుముందు కలెక్టర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్), క్రిటికల్ కేర్ యూనిట్‌లతో కూడిన భవన సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం జీజీహెచ్‌లో సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష జరిపారు. విభాగాల వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటిని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల కోసం ప్రతిరోజు 1800 నుండి 2000 మంది వరకు అవుట్ పేషంట్ రోగులు జీజీహెచ్‌కు వస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని విభాగాల పనితీరు మెరుగుపడాలన్నారు. జీజీహెచ్‌లో 180 మంది వైద్యులు, సరిపడా సిబ్బందితోపాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలన్నారు. మేజర్, మైనర్ సర్జరీలతోపాటు షుగర్, బీపీ, డెంగీ, మలేరియా, థైరాయిడ్ వంటి వ్యాధి నిర్ధారణ టెస్టులు ఉచితంగా చేస్తారని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేల రూపాయల చార్జీలు వసూలు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా జీజీహెచ్‌లో కీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య రంగాన్ని మరింతగా మెరుగుపర్చాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జీజీహెచ్‌లో ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ, టాయిలెట్లను చక్కదిద్దాలని, లీకేజీలను అరికట్టాలని, ఫ్లోరింగ్ తదితర మరమ్మతు పనులను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు గడువు విధించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్థో ప్రొఫెసర్ రాములు, డాక్టర్ జలగం తిరుపతిరావు, ఇతర హెచ్‌వోడీలు, నర్సింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైలుపట్టాలపై కన్నీటి వ్యథ

- ఆత్మహత్యలు.. ప్రమాదాలు
- అడ్రస్ తేలకుండానే ఆఖరి మజిలీ పూర్తి
- ఆధారాలు దొరక్కపోతే అనాథే..
- వారంలో రెండుమూడు ఘటనలు

మనిషి జీవితాన్ని రైలు పట్టాలతో పోల్చడం సాధారణమే. రైలు పట్టాల్లాంటి ఈ జీవితంలో ఎన్నో మార్పులు, మలుపులు. పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాల్సిన జీవితాలు ఆ రైలు పట్టాలపై అర్ధంతరంగా ముగుస్తున్నాయి. బరువెక్కిన గుండెలు రైలు పట్టాలెక్కుతున్నాయి. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు కొందరైతే.. ప్రమాదవశాత్తు రైళ్లలో నుంచి పడి దుర్మరణం పాలవుతున్న వారు మరికొందరు. పట్టాలపై జీవితాన్ని ముగించిన వారిలో చాలా మంది ఎవరనేది తెలియకపోవడంతో అనాథలుగానే వారి ఆఖరి మజిలి ముగుస్తోంది.

ఖలీల్‌వాడి : రైలు పట్టాలపై కనిపించే మృతదేహాలు హృదయాలను కలిచివేస్తాయి. వారంలో ఒకరు లేదా ఇద్దరు రైలు పట్టాలపై మృతి చెందిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. పట్టాలపై అర్ధంతరంగా జీవితాన్ని ముగించిన వారు అసలు ఎవరు? అనేది తెలియకపోవడం.. అనాథల్లా వారి ఆఖరి మజిలీ ముగియడం బాధాకరం. వ్యక్తిగత, కుటుంబ సమస్యలతో రైలు కిందపడి కొందరు ఆత్మహత్య చేసుకుంటుండగా, రైళ్లలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మరికొందరు మృతి చెందుతున్నారు. ఇటీవల నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

భద్రంగా ఆధారాలు

గుర్తు తెలియని మృతదేహాలను జీజీహెచ్‌లోని మార్చురీకి పంపే ముందు ఆధారాలను సేకరిస్తున్నారు. మృతదేహంపై షర్ట్, పాయింట్ ఉంటే టైలర్ చిరునామా ఆధారంగా మృతుడి ఎక్కడి వ్యక్తి అనేది గుర్తిస్తారు. కొన్ని మృతదేహాలపై దుస్తులు సైతం ఉండకపోవడంతో వారి చిరునామా గుర్తించడం కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలో మృతదేహంపై పుట్టుమచ్చలు, అంగవైకల్యం, ఎత్తు, రంగు, జుట్టు, దుస్తులను భద్రపరుస్తారు.

అనాథ మృతదేహాల కాల్చివేత

రైలు పట్టాలపై లభించిన మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెండు, మూడు రోజులు ఉంచి ఆ తర్వాత ఖననం చేసేవారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వెలికితీసి రీ పోస్టుమార్టం చేయడానికి వీలు ఉండేది. కొన్నిసార్లు మృతుల సంబంధీకులు వచ్చి మృతదేహాలను తవ్వి తీసుకొని ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు పూర్తి చేసేవారు. కానీ ఇప్పుడు ఖననం చేసిన మృతదేహాలను వెలికితీసేందుకు అధికారులు, రైల్వే పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు.



ప్రస్తుతం దహన సంస్కారాలు పూర్తి చేస్తున్నారు. అంతకు ముందు కాలర్‌బోన్‌ను తీసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వివరాలను అందుబాటులో ఉంచుతున్నారు.

హత్య.. పట్టాలపై ఆత్మహత్యగా..

హత్యలకు పాల్పడుతున్న కొందరు మృతదేహాలను రైలు పట్టాలపై పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టాలపై మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు. అది హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో ముందుగా దర్యాప్తు చేస్తున్నారు. హత్యగా అనుమానం ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేస్తున్నారు.

ఘటనాస్థలం ఆధారంగా..

రైల్వే పట్టాలపై మృతదేహాన్ని పరిశీలించి అది హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో దర్యాప్తు చేస్తాం. మృతదేహాన్ని దాదాపు రెండు రోజుల తర్వాతే మృతదేహాలను కాల్చివేస్తాం. రైల్వే ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణికులు బోగీ తలుపుల వద్ద ఉండొద్దు.. దీంతో ప్రమాదాలు సంభవిస్తాయి. – సాయిరెడ్డి, రైల్వే ఎస్సై, నిజామాబాద్

- కుటుంబ సమస్యల కారణంగా ఈనెల 7వ తేదీన 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆర్మూర్ – మోర్తాడ్ రైల్వే స్టేషన్‌ల పరిధిలోని లక్కోర వద్ద పట్టాలపై చోటుచేసుకుంది. సదరు వ్యక్తి పట్టాలపై పడుకోవడంతో అతడిపై నుంచి గూడ్స్ రైలు వెళ్లింది.
- ఈనెల 16న నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నవీపేట్ –జానకంపేట్ రైల్వే స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడి వివరాలను సేకరించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.

సంవత్సరం	మృతుల సంఖ్య	గుర్తించిన మృతదేహాలు	గుర్తించని మృతదేహాలు
2021	85	61	24
2022	97	60	37
2023	139	121	18
2024	146	124	22
2025	72	61	11

క్లుప్తంగా

పోతాయిపల్లి యువకుడికి డాక్టరేట్



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం పోతాయిపల్లి గ్రామానికి చెందిన నీరడి సూర్యం శనివారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్త లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో ' సింథసిస్, క్యారెక్టరైజేషన్ ఆప్టికల్, మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఫొటోక్యాటలిటిక్ అండ్ బయాలజికల్ యాక్టివిటీ ఆఫ్ మాంగనీస్,ఎటర్బియం,యట్రియం,నియోడైమియం అండ్ డిస్ప్రోసియమ్ డోప్డ్ కో బాల్ట్ నానోఫెరైట్స్''అనే అంశంపై పరిశోధన చేసినట్లు సూర్యం తెలిపారు.కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ జాతీయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

ప్లాంటేషన్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- డీఆర్డీవో సాయాగౌడ్



రుద్రూర్: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ప్లాంటేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. రుద్రూర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాలుగవ విడత సామాజిక తనిఖీ మండలస్థాయి ప్రజావేదిక ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ వివరాలను ఆడిట్ బృందం ప్రజావేదికలో వివరించారు. గ్రామసభల్లో వచ్చిన అభ్యంతరాలు, రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం తదితర అంశాలు బహిర్గతం కాగా సంబంధిత సిబ్బందికి రూ. 20వేల జరిమానా విధించారు.జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎఫ్ఎం లక్ష్మారెడ్డి, ఎంపీడీవో భీమ్‌రావ్, ఈజీఎస్ ఏపీవో రాజేశ్వర్, ఉపాధి హామీ ఆడిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

'విదేశీ విద్య' పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాలలో చదివేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు సంబంధిత యూనివర్సిటీ అడ్మిషన్, వీసా, ఇన్‌కం సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. వచ్చే నెల 31 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీసుల అదుపులో నిందితులు?

సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో చెరువు కట్టపై శుక్రవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. 23న ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు మధ్యలో మరో వ్యక్తిని తీసుకెళ్తున్నట్లు గ్రామంలోని సీసీ కెమెరాల్లో రికార్డయిన విషయం తెలిసిందే. వాహనం నంబర్ ద్వారా నిందితులను పట్టుకున్నట్లు సమాచారం. నిందితులు ఆర్మూర్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు తెలిసింది. ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

వరుస వర్షాలు.. సాగులో జాగ్రత్తలు



అంబం (ఆర్) శివారులోని వరి పొలంలో నిలిచిన వరద నీరు

రుద్రూర్: జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పంట పొలాల్లో మురుగు నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. ముంపునకు గురైన నారుమడులు, వరి పొలాల నుంచి మురుగు నీటిని వెంటనే తీసివేయాలి. భారీ వర్షాలు కురుస్తున్నందున వరినాట్లు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఇప్పటి వరకు నారు వేయని రైతులు పొలాన్ని దమ్ము చేసి నేరుగా విత్తే పద్ధతిని అవలంబించాలి. స్వల్పకాలిక వరి రకాలను విత్తుకోవడం ద్వారా ఖర్చును ఆదా చేసుకోవచ్చు.

పత్తి

ముంపునకు గురైన పత్తి పంటకు వడలు తెగులు ఆశించే అవకాశం ఉండడంతో మురుగు నీటిని పొలం నుంచి తీసివేసి పంట త్వరగా కోలుకోవడానికి 10గ్రాముల పాలిఫిడ్ (19:19:19) లేదా మల్టీ-కే (13-0-45) లేదా యూరియాతోపాటు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ (లేదా) 2గ్రాముల కార్బండజిమ్-మ్యాంకోటేట్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేలా మొక్క మొదళ్ల చుట్టూ పోయాలి.

మొక్కజొన్న

మొక్కజొన్న పంట ఎక్కువ నీటిని తట్టుకోలేదు. పొలం నుంచి నీటిని వెంటనే తీసివేయాలి. అధిక వర్షాలతో నేలలో భాస్వరం లోపల ఏర్పడి మొక్కలన్ని ఊదా రంగులోకి మారే అవకాశం ఉంటుంది. వర్షాలు నిలిచిన తర్వాత 5గ్రాము 19-19-19 మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

సోయాచిక్కుడు

అధిక వర్షాలతో వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగులు గమనిస్తే నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేలబాగా తడిచేటట్లు మొక్క మొదళ్ల చుట్టూ పోయాలి.

పసుపు పంటకు తెగుళ్ల బెడద



ఆర్మూర్ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పసుపు పంటలో నిలిచిన నీరు

ఆర్మూర్: ముసురు వర్షాలతో వ్యవసాయ క్షేత్రాలు నీటితో నిండిపోయి పసుపు పంట తెగుళ్ల బారిన పడే ప్రమాదం ఉంది. పంటలకు లద్దె పురుగు (ఆకుపచ్చ పురుగు) తెగులు, దుంప కుళ్లు, జింక్, ఐరన్ లోపంతో పంటల దిగుబడి గణనీయంగా పడిపోయే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారులు సూచిస్తున్నారు.

దుంప కుళ్లు

పసుపు పంటలో వర్షం నీరు నిలువ ఉంటే దుంప కుళ్లు సోకే అవకాశం ఉంది. నివారణకు ఎకరానికి రెండు బస్తాల వేప పిండి వేయాలి. 0.1 శాతం డోమిల్ లేదా మంకోజెబ్ మందు ద్రావణంతో తడిచేలా మొక్కల మొదళ్ల దగ్గర వేయాలి. డ్రిప్ ఉన్నవారు 600 గ్రాముల కర్బెట్, వంద గ్రాముల కోరాజన్‌ను కలిపి పిచికారీ చేయాలి. లేదా ట్రైకోడర్మావిరిడి బాగామాగిన పశువుల ఎరువులో వారం రోజులపాటు కలిపి ఉంచిన మిశ్రమాన్ని లేదా వేప పిండితో కలిపి చల్లుకోవాలి.

ఆకుపచ్చ తెగులు



ఆకుపచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ (ట్రాల్ట్) ఒక మిల్లీలీటర్/1, లీటర్ లేదా సాఫ్ రెండు గ్రాముల/2 లీటర్లలో కలిపి సాండోవిట్ స్టిక్కర్‌ను ఉపయోగించి స్ప్రే చేయాలి. మంచు, వర్షం కురిసే సమయంలో స్ప్రే చేయకూడదు.

జింక్, ఐరన్ లోపం

వర్షాలు అధికంగా పడితే ఆకులు తెలుపుగా కనిపిస్తాయి. జింక్, ఐరన్ లోపం నివారణ కోసం మోనో ఫ్లేస్ 5 ఎంఎల్/1 లీటర్ నీటిలో కలిపి ఆకులపై స్ప్రే చేయాలి.

లద్దె పురుగు (ఆకుపచ్చ పురుగు)



ఆకుపచ్చ పురుగుతో పసుపు ఆకులపై రంధ్రాలు ఏర్పడతాయి. ఈ తెగులు నివారణకు క్వినల్‌ఫాస్ 2 మిల్లీ లీటర్లు/1 లీటర్ నీళ్లలో లేదా క్లోరోపైరిపాస్‌ను 3 మిల్లీలీటర్లు/1 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నీళ్లు నిలువ ఉంచొద్దు

అధిక వర్షాల నేపథ్యంలో పసుపు క్షేత్రాలలో నీళ్లు నిలువ ఉండకుండా రైతులు జాగ్రత్త పడాలి. నీరుంటే దుంపకుళ్లు తెగులు సోకే ప్రమాదం ఉంది. తెగుళ్ల బెడద నివారణకు వ్యవసాయాధికారులు సూచించే మందులను వాడి పంటను కాపాడుకోవాలి.

– విజయలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఆర్మూర్

గ్రామాభివృద్ధి కమిటీలు ఆదర్శంగా ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి భరతలక్ష్మి

మోర్తాడ్(బాల్కొండ): గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)లు ఆదర్శంగా ఉండాలే తప్ప.. చట్టాన్ని అతిక్రమించకూడదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎస్ భరతలక్ష్మి సూచించారు. గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించాలని వెల్లడించారు. మోర్తాడ్, ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భరతలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, చట్టాన్ని గౌరవిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. కొన్ని వీడీసీలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పక్షపాత ధోరణి అవలంబించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అత్తారింటికి వెళ్లిన మహిళలకు ఏమైనా సమస్యలుంటే న్యాయం కోసం కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పోలీసు కమిషనర్ సాయి చైతన్య హితవు పలికారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. వాట్సాప్ గ్రూప్‌లలో అలజడి సృష్టించే మెసేజ్‌లను చేయవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకూడదని తెలిపారు. కల్తీకల్లును అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలను నడిపేవారు హెల్మెట్‌తోపాటు కాగితాలను పక్కాగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్ రావు, ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సరళారాణి, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో రాజుగౌడ్, మోర్తాడ్ తహశీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ



డీఈవోతో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్: ఉమ్మడి నల్గొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పీఆర్టీయూ నాయకులతో కలిసి జిల్లాలో విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, టీచర్ల సర్దుబాటు విధానం, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్యాబోధన చేయాలని తెలిపారు. ఈ నెల 29న నిర్వహించే కాంప్లెక్స్ మీటింగ్‌ను నాగుల పంచమిని పురస్కరించుకొని 30న నిర్వహించాలన్నారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నీటి మట్టానికి, నిల్వకు ఎంతో తేడా!

మీకు తెలుసా?



శ్రీరాంసాగర్ జలాశయం

జలాశయాల్లో నీటి మట్టానికి, నీటి నిల్వకు ఎంతో తేడా ఉంటుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం 1091 అడుగులు కాగా నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు ఉంటుంది.

- ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1070 అడుగుల నీటి మట్టం ఉంది. కానీ, నీటి నిల్వ మాత్రం 22 టీఎంసీలు ఉంది.
- నీటి మట్టం మరో 21 అడుగులకు చేరితే ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుంది. 21 అడుగులే కదా పెద్ద కష్టమేమీ కాదులే అని అంతా భావిస్తారు.
- ప్రాజెక్ట్ నీటి మట్టం పెరిగిన కొలదీ విస్తీర్ణం పెరుగుతుంది. దీంతో ఒక్కో అడుగుకు ఎక్కువగా నీరు నిల్వ ఉంటుంది. చివరి మూడు అడుగుల్లో ఒక్కో అడుగుకు 6 టీఎంసీల నీరు అవసరమవుతుంది.
- ప్రాజెక్ట్ నీటి మట్టం 1045 అడుగుల నుంచి ప్రారంభమైంది. నీటి నిల్వ సామర్థ్యం 1 టీఎంసీల నుంచే ప్రారంభమవుతుంది.

– బాల్కొండ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



ధర్మారంలోని గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ధర్మారం(బి) గురుకుల పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ల తనిఖీ

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలతోపాటు అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుండడాన్ని గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో 640 మంది విద్యార్థినులు ఉండగా, వారికి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. మెనూ పరిశీలించి అందుకు అనుగుణంగా ఆహార పదార్థాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో చిన్నారుల హాజరు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం, నేర్పిస్తున్న ఆటాపాటలను తెలుసుకున్నారు. ప్రతి రోజు కోడిగుడ్డు అందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిన మన ఊరు-మన బడి పనులను గమనించిన కలెక్టర్, వెంటనే వాటిని పూర్తిచేసి తరగతి గదుల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి అశోక్

జిల్లా విద్యాధికారి అశోక్



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆర్మూర్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ పేర్కొన్నారు. నందిపేట మండలం తల్వేద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దుబాయ్‌కి చెందిన 'జాయ్ ఫర్ లైఫ్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5లక్షలతో విద్యార్థులకు యూనిఫామ్స్, టై, బెల్ట్, షూ, పదో తరగతిలో మెరిట్ సాధించిన 36 మంది విద్యార్థులకు రూ. 10 వేల చొప్పున నగదును అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో పట్టుదల ఉండాలన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు శ్రద్ధతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని సూచించారు. తల్వేద పాఠశాలలో అదనపు గదులు నిర్మాణం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడుతానని చెప్పారు. ఫౌండేషన్ చైర్మన్ రాహుల్ దుబాయ్‌లో పుట్టి పెరిగి ఇక్కడ ఉన్న బంధువుల ద్వారా సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ గంగారెడ్డి, ఎంఈవో గంగాధర్, హెచ్ఎం మోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామ శివారులో విద్యుత్ షాక్‌తో శనివారం గేదె మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని తడికొప్పుల సంగమేశ్‌కు చెందిన గేదె మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఎర్తింగ్ వైరుకు తగలడంతో షాక్‌తో మరణించిందని బాధితుడు పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

రుద్రూర్: పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామశివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శనివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. లారీని కోటగిరి పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జానకంపేటలో చోరీ



బోధన్: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన మిద్దె గోదావరి ఇంట్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని బీరువాను పగులగొట్టి 8 గ్రాముల బంగారు, 10 తులాల వెండి నగలు అపహరించినట్లు బాధితురాలు తెలిపారు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్ అపహరణ

నవీపేట: మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంతలో బైక్ చోరీకి గురైంది. రెంజల్ మండల కేంద్రానికి చెందిన ఆనంద్ మేకల కొనుగోలు కోసం వచ్చి సంత ప్రాంగణంలో బైక్‌ను పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. అరగంట తర్వాత వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన సౌందర్య (20) అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సౌందర్య బయటికి వెళ్లిందన్నారు. తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డిలో కుక్కల స్వైర విహారం

- ఎనిమిది మందిపై దాడి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ఎనిమిది మందిపై దాడి చేశాయి. పట్టణంలోని ఇందిరానగర్, గాంధీనగర్ కాలనీలో పనులు చేసుకుంటున్న గోపాల్, హర్షిత, శివ రాములు, హఫీజ్, సంగయ్య, మైస కళ, రాములు, మణెవ్వలను కుక్కలు కరిచాయి. కుక్కల దాడిలో గాయపడిన వారంతా ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఎల్లారెడ్డిలో కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు శనివారం త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కామారెడ్డికి 70 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగంలోని టైరు హాజీపూర్ శివారుకు రాగానే పేలింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపు చేశాడు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్య

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలం బెజ్జోరా మాజీ సర్పంచ్ కోగూరు ప్రతిభ(35) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో భీమ్‌గల్ ఎస్సై సందీప్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతురాలు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అమర జవాన్ల త్యాగాలను మర్చిపోలేం

- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, నేతలు

సుభాష్‌నగర్: దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ల త్యాగాలను మర్చిపోలేమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, సమర్పణ భావన పెంపొందించడానికి కార్గిల్ విజయ్ దివస్ స్ఫూర్తిదాయక ఘట్టంగా నిలుస్తుందని తెలిపారు. శనివారం కార్గిల్ విజయ దివస్ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితో కలిసి నగరంలోని ఎల్లమ్మగుట్ట చౌరస్తాలో కార్గిల్ స్మారక స్తూపం వద్ద వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ భారత భూభాగం నుంచి కశ్మీర్‌ను వేరు చేయాలనే ఉద్దేశంతో పాకిస్తాన్ కార్గిల్ జిల్లా పర్వతాల ఆక్రమణను ఆపరేషన్ విజయ్ పేరుతో సైన్యం తిప్పికొట్టిందని గుర్తుచేశారు. దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ పాకిస్తాన్ దురాక్రమణను తిప్పికొట్టి, కార్గిల్ పర్వతాలపై భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన జవాన్ల ధైర్యం, నిబద్ధత ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేశ్ యాదవ్, నాగరాజు, దొంతుల రవి, పంచరెడ్డి శ్రీధర్, పడాల భూపతి, హరీశ్‌రెడ్డి, మెట్టు విజయ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు



మహమ్మదీ(ఫైల్)



బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన కారు

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ చౌరస్తా వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ మహమ్మదీ(56), కుమారుడు షేక్ సోహెల్, కోడలు సాధియా, ఇద్దరు పిల్లలను తీసుకొని కారులో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్తున్నారు. దాస్‌నగర్ చౌరస్తా వద్ద కారును నిజామాబాద్ వైపు మలుపుతుండగా నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న సోహెల్, మహమ్మదీ, సాధియా, పిల్లలకు తీవ్రగాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి కారు డోర్లను పగులకొట్టి గాయపడిన వారిని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా, మార్గమధ్యలోనే మహమ్మదీ మరణించింది. మిగతా నలుగురు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త షేక్ అహ్మద్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.